క్లుప్తంగా

కంట్రోల్ రూమ్‌ను వినియోగంలోకి తేవాలి



మండవల్లి: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ తిరిగి వినియోగంలోకి తేవాలని సీఐ రవికుమార్ పేర్కొన్నారు. మండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోకుమూడి సెంటర్‌లో మండవల్లి పోలీస్‌స్టేషన్ అవుట్ పోస్టును, ట్రాఫిక్ రెగ్యులేషన్ పోస్టును సీఐ గురువారం సందర్శించారు. అవుట్ పోస్ట్ నిర్వహణకు మండవల్లి ఎస్ఐ రామచంద్రరావుకు సీఐ తగు సూచనలు చేశారు.

రేపు కైకలూరులో జాబ్‌మేళా

కైకలూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల(స్కిల్ హబ్)లో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి గురువారం తెలిపారు. వరుణ్ మోటార్స్, మెడ్ ప్లస్ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 100 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ బీడీఎం ఫార్మసీ వంటి విద్యార్హతలు కలిగి 18 – 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు 97013 57315, 62811 19575, (కమాండ్ కంట్రోల్ నంబర్స్ 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279) నంబర్లలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని చెప్పారు.

60 మంది దీక్ష విరమణ



కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి మాలధారులు దీక్షా కాలం ముగియడంతో గురువారం అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. ఈ ఏడాది నవంబరు 12 నుంచి డిసెంబరు 26 వరకు దీక్ష నిర్వహించారు. మొత్తం 60 మంది దీక్షాపరులు అమ్మవారి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరరావు దీక్షను విరమింపజేశారు. ఆలయ కార్యనిర్వహణధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు గురువారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం వారికి డాక్టర్ యలమంచి గోపీచంద్ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ ప్రతినిధులు పెరుమాళ్లు, గుమ్మడి రామకృష్ణ, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి

పామర్రు: స్థానిక చాట్లవానిపురంలో జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గురువారం కేసు నమోదైంది. పామర్రు సీఐ సుభాకర్ తెలిపిన వివరాల ప్రకారం చాట్లవానిపురానికి చెందిన చాట్ల వెంకటేశ్వరరావు, చాట్ల సతీష్‌లకు ఈనెల 20న రూ.300 కోసం గొడవ మొదలైంది. అనంతరం వెంకటేశ్వరరావు కర్రతో సతీష్‌పై దాడి చేసి గాయపర్చాడు. క్షతగాత్రుడైన సతీష్‌ను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సతీష్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని సీఐ పేర్కొన్నారు.

షిర్డి సాయి ఆలయంలో విశేష పూజలు



పామర్రు: స్థానిక సాయినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ షిర్డి సాయి మందిరంలో గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత బాబాకు ఆవుపాలతో అభిషేకాలను నమక చమకాలతో స్నపన కార్యక్రమాలను చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం 300 మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో షిర్డి సాయి భక్త సమాజ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, సాయి, రమేష్, సురేష్, అప్పయ్య, భక్తులు పాల్గొన్నారు.

అతివేగంతో మృత్యుకౌగిళ్లు...

- ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు
- నిత్యకృత్యంగా ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోవడంతో పాటు గాయాలపాలవుతున్న ప్రయాణికులు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గుడ్లవల్లేరు: శృతి మించిన అతి వేగం అమాయకుల ప్రాణాలు తీస్తోంది. కారు, ట్రాక్టర్, లారీ, బైక్, ఆటో ఏ వాహనాన్ని అయినా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగానే డ్రైవ్ చేస్తే ప్రమాదాలు ఉండవు. కానీ వ్యవసాయ సీజన్‌లో తీసుకెళ్తున్న కూలీల ప్రాణాలు ఆటో, ట్రాక్టరు, ట్రక్ ఆటోవాలాల గుప్పెట్లో ఉంటున్నాయి. ఆటోల్లో పరిమితికి మించి, కూలీలను ఎక్కించటంతో ప్రయాణంలో కూలీలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఆటో బయటకు సన్నటి పైపుల మీద కూర్చొని, నిలబడి మహిళా కూలీలు ప్రయాణిస్తున్నారు. కనీసం ఎదురుగా వచ్చే వాహనం నుంచి సంకేతంగా హారన్ వినబడకుండా ఆటోలో పెద్ద సౌండ్‌తో వచ్చే సినిమా పాటలతో మోగిపోతున్న స్పీకర్లు ఆటోవాలాలు అమరుస్తున్నారు.

ఇష్టారాజ్యంగా డ్రైవింగ్..

ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పుకోవటానికి బ్రేక్ వేయటానికి కూడా డ్రైవర్ కదలకుండా తన సీటు పక్కనే 5–6 మందిని ఎక్కించుకుంటున్నారు. ఆటోలో ఎక్కించుకునేందుకు ఆరు లేక ఎనిమిది మంది వరకే నిబంధనలు వర్తిస్తాయి. కానీ పరిమితికి మించి, ఆటోవాలాలు కూలీలను తరలిస్తున్నారు. పనులు చూసేది దూర ప్రాంతాలైనా డబ్బుల కోసం కూలీలు ఆటోవాలాలను ఆశ్రయిస్తున్నారు. మితిమీరిన వేగం కూలీల ప్రాణాలు తీస్తోంది. మద్యం సేవించి, ఆటో తోలేవారు లేకపోలేదు. దీంతో పొట్ట కూటి కోసం పొరుగూళ్ల నుంచి వచ్చే కూలీలు విగతజీవులుగా మారుతున్నారు. ప్రయాణంలో కూలీలకు రక్షణ గూర్చి ఆలోచించటం లేదు.



పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణిస్తున్న కూలీలు(ఫైల్)

డ్రైవింగ్‌పై పట్టు లేక..



చాలా మంది కార్లు, ఆటోలతో పాటు బైకులతో సహా డ్రైవ్ చేసే వాహనదారులకు తమ డ్రైవింగ్‌పై పట్టు ఉండడం లేదు. దీంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. శిక్షణ పొందకుండా లైసెన్సులు పొందటం వలన తమ ప్రాణానికే గాక ఎదుటి వారి ప్రాణానికి హాని చేకూరుతుంది. అలాంటి వాటిని అధికారులు నివారించాలి.

– నత్తా ప్రభుదాస్, డ్రైవింగ్ శిక్షకుడు, గుడ్లవల్లేరు

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం...



ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహన చోదకులకు జరిమానాలను విధించటమే కాకుండా కేసులు కూడా నమోదు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రజల్లో కూడా అవగాహన కల్పించేందుకు చర్యలను చేపట్టాం. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడం.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, గుడ్లవల్లేరు ఎస్ఐ

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు పోరుబాట



గుడ్లవల్లేరులో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జాన్‌బెన్నీ, నాయకులు

గుడ్లవల్లేరు: విద్యుత్ చార్జీలను పెంచిన కూటమి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉద్యక్షుడు జాన్‌బెన్నీ లింగం పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం గుడివాడ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే పోరుబాటకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం పోరాటానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత వీఎం రంగా వర్ధంతిని పురస్కరించుకుని రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బైండ్ల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజులు, చినగొన్నూరు సర్పంచి కోటప్రోలు నాగు, నాయకులు మహారెడ్డి మురళి, సీహెచ్.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

పామర్రు: ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ జరుగుతుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి వైఖరికి నిరసనగా ఈ ర్యాలీ స్థానిక పార్టీ కార్యాలయం నుంచి విజయవాడ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం విద్యుత్ శాఖాధికారికి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా సీపీఐ శత వసంతాల వేడుక



మొవ్వలో సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి(మొవ్వ): గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో గురువారం సీపీఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూచిపూడి – పెదపూడి కాంచన రావు సీపీఐ కార్యాలయంలో సీనియర్ కామ్రేడ్ గొట్టిపాటి నాగేశ్వరరావు పతాక ఆవిష్కరణ చేయగా, కూచిపూడి సెంటర్‌లో పామర్రు నియోజకవర్గ ఆహ్వాన కమిటీ సభ్యుడు కోదాటి నారాయణరావు ఆవిష్కరించారు. వేడుకల్లో నాయకులు టి.తాతయ్య, చెరుకు శ్రీనివాసరావు, కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శులు కొండ నాగేశ్వరరావు, బోరుకాటి నరసింహరాజు, నందం వెంకటేశ్వరరావు, మోదుమూడి సద్గుణరావు పాల్గొన్నారు.

పేదలకు అండ ఎర్రజెండా

గుడివాడరూరల్: పేదలకు అండదండలుగా నిలిచి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది ఎర్రజెండానేనని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో భారతీయ కమ్యూనిస్టు పార్టీ 100వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను గూడపాటి ఆవిష్కరించి మాట్లాడారు. ఎంతో మంది ప్రాణాలు అర్పించి పేదలకు అండదండలుగా నిలిచి పార్టీని బలోపేతం చేశారన్నారు. సీపీఐ ఎప్పటికప్పుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, రైతు నేత గుడిపూడి బాబూరావు, సభ్యులు పి.రంగారావు, జి.శేషు, కె.వెంకన్న, డి.అర్జున్, కె.జోజి, పి.గిరి, కె.నానిలు పాల్గొన్నారు.

గ్రామసభలతో భూ సమస్యల పరిష్కారం



ఉలవలపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకరాజు, అధికారులు



మండవల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

ముదినేపల్లిరూరల్: రెవెన్యూ గ్రామసభలతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని పెయ్యేరులో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నీభూమి–నీహక్కు పేరుతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సదస్సుల్లో ఇచ్చే అర్జీలతో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు వినతి పత్రాలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవలపూడిలో అర్జీల స్వీకరణ

గుడ్లవల్లేరు: ఉలవలపూడిలో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. అర్జీలను పరిశీలించి, సమస్యలు పరిష్కారం చేస్తామని తహసీల్దార్ బి.లోకరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, గ్రామ సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

మండవల్లి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండవల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులను చేపట్టామని తెలిపారు. సదస్సులో ఆరు అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్వో శ్యామలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మీసాల వెంకన్నకు లక్ష తులసి పూజ



కైకలూరు: స్థానిక మీసాల వెంకన్న దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఈవో వి.ఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తరద్వార దర్శనం, 13న గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

గుర్రపుడెక్క తొలగింపు



కైకలూరు: గుర్రపుడెక్క తొలగింపు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. కై కలూరు మండలం గోపవరం గ్రామం నుంచి నరసాయిపాలెం వరకు పంట కాలువలో పూడికతీత, గుర్రపుడెక్క పనులను నీటి సంఘాల చైర్మన్ పొత్తూరి వాసురాజు గురువారం పరిశీలించారు. గోపవరం లాకుల వద్ద పూర్తిస్థాయిలో శుభ్రం చేయడం వల్ల చివరి గ్రామాలకు నీరు అడ్డంకులు లేకుండా చేరుతుందన్నారు. పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని శీతనపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కట్టా రమేష్‌ను కోరారు.

వంగవీటి రంగా సేవలు చిరస్మరణీయం



ఆటపాకలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎన్నార్, నాయకులు

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లిరూరల్: దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు, ఆటపాక గ్రామాల్లో రంగా విగ్రహాలకు గురువారం ఘన నివాళులరించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ.. కులం, మతం అనే బేధాలు చూడకుండా రంగా పేదలకు సాయం చేశారన్నారు. ఆశయ సాధనలో మేటి వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు అన్నారు. మండవల్లిలో రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రంగా సెంటర్ వద్ద రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ముదినేపల్లి సంతబజారులో, చిగురుకోట శివారు నరసన్నపాలెంలో వీఎం రంగా విగ్రహానికి డీఎన్నార్ నివాళులర్పించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచే వ్యక్తి వంగవీటి

గుడివాడరూరల్: ప్రజల గుండెల్లో ఎప్పుడూ నిలిచిపోయే వ్యక్తి వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక భయ్యావారి వీధిలోని తన కార్యాలయంలో రంగా చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి స్వార్థ రాజకీయాలకు బలైన వంగవీటి మోహనరంగా ఆదర్శనీయులని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టణంలోని ఏజీకే స్కూల్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి నివాళులర్పించారు.

రంగా ఆశయ సాధనకు కృషి

పామర్రు: మహోన్నత వ్యక్తి వంగవీటి మోహనరంగా ఆశయ సాధన కోసం అందరూ కలిసి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో రంగా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి, దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు. పామర్రు తోటలో నూతనంగా ఏర్పాటు చేసిన రంగా విగ్రహం వద్ద ఆ సంఘ నాయకులు నివాళులర్పించారు.

ఈదులమద్దాలి వద్ద కుప్పకూలిన వంతెన

- డ్రెయిన్‌లో పడ్డ ఇసుక ట్రాక్టర్ ట్రక్కు
- ప్రాణనష్టం లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు



ఈదులమద్దాలి వద్ద కూలిన వంతెన



చంద్రయ్య డ్రెయిన్‌లో పడిపోయిన ట్రాక్టర్

పెదపారుపూడి: వంతెన కూలి ట్రాక్టర్ డ్రెయిన్‌లో పడిపోయిన సంఘటన మండలంలోని ఈదులమద్దాలి వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నందివాడ మండలానికి చెందిన ట్రాక్టర్, తోట్లవల్లూరు మండలం నుంచి ఇసుక లోడ్‌తో మండలంలోని ఈదులమద్దాలి వద్ద చంద్రయ్య డ్రెయిన్‌పై పడింది. శిథిలావస్థలో ఉన్న వంతెనపై నుంచి వెళ్తుండగా వంతెన ఒక్కసారి కూలిపోవటంతో ట్రాక్టర్ వెనుక ఉన్న ఇసుక ట్రక్కు కింద పడిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరకపోవటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వలనే..

చంద్రయ్య డ్రెయిన్ చాలా కాలం క్రితం నిర్మించిన వంతెన కావడంతో శ్లాబ్ కింద పెచ్చులు ఊడి ఇనుప సువ్వలు బయటకువచ్చాయి. వంతెన కూలడానికి సిద్ధంగా ఉందని స్థానికులు ఆండ్‌బీ అధికారులకు పలు సార్లు చెప్పినా పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు. వంతెన కూలేందుకు సిద్ధంగా ఉందని, ఆర్అండ్‌బీ అధికారులు వంతెన ఇరువైపులా హెచ్చరిక బోర్డులు అయితే పెట్టారే గాని, ఇసుక ట్రాకర్లు, లారీలు వెళ్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు పెదపారుపూడి నుంచి కంకిపాడు వరకు వెళ్లే రోడ్డు సరిగా లేకపోవటంతో వందల సంఖ్యలో వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగించడంతో వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఈదులమద్దాలనుంచి యలమర్రు మీదుగా పామర్రు వెళ్లే వాహనాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన కూలిన విషయం తెలుసుకున్న ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

నేడు పెదపాలపర్రుకు సిసోడియా రాక

ముదినేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రెవెన్యూ భూ పరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా శుక్రవారం మండలంలోని పెదపాలపర్రుకు రానున్నట్లు తహసీల్దార్ జేఎస్ సుభానీ తెలిపారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారన్నారు. సిసోడియా రాక సందర్భంగా ఏలూరు ఆర్డీవో అంబరీష్ గురువారం గ్రామంలోని ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామస్తులే కాక సరిహద్దు జిల్లాల వారు సైతం ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. శుక్రవారం జరిగే సదస్సులో కలెక్టర్ వెట్రి సెల్వీ, జాయింట్ కలెక్టర్ ధాత్రీ రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

సులభ రుణాలకు కృషిక యాప్



కృషిక యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముదినేపల్లిరూరల్: రైతులు బ్యాంకుల నుంచి సులభంగా వ్యవసాయ రుణాలు పొందడానికి కృషిక యాప్‌ను వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. వ్యవసాయ సెంట్రల్ స్కీమ్ సభ్యులు రవీంద్రకుమార్, ప్రియ, దీపక్‌రాజ్‌పుత్ మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి మండలంలోని సింగరాయపాలెంలో గురువారం పర్యటించి కృషిక యాప్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకుంటే బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేకుండా నేరుగా కిసాన్ క్రెడిట్ కార్డులు పొందవచ్చన్నారు. ఈ కార్డుల ద్వారా సులభంగా వ్యవసాయ రుణాలు పొందే వీలుంటుందని తెలిపారు. అవగాహన సమావేశానికి హాజరైన రైతుల వివరాలను యాప్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేశారు. కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ లలితసుధా, వ్యవసాయాధికారి ఉషా, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

మండవల్లి: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ రవికుమార్ పేర్కొన్నారు. లోకుమూడి దత్తాశ్రమంలో గురువారం సీసీ కెమెరాల వల్ల ఉపయోగాలు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టంపై ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అపరిచితులు పంపే లోన్లు, గిఫ్టు సందేశాలకు ఆకర్షితులు కావొద్దన్నారు. ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి శ్రీకారం



పనులు పరిశీలిస్తున్న సుబ్బారావు, హెచ్ఎం వేణుగోపాలరావు

గోగినేనిపాలెం(ఘంటసాల): స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం అభివృద్ధికి సహకారం అందిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలు ఆదర్శనీయమని గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం ఎన్జీ రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సెంట్రల్ జోన్ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ క్రీడా మైదానం అభివృద్ధి పనులను గురువారం చేపట్టారు. ఈ పనులను హెచ్ఎంతో పాటు గ్రామానికి చెందిన కుంపటి సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సహకరించిన కుంపటి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కుంపటి చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.